క్లుప్తంగా

సజావుగా పరీక్షలు ప్రారంభం


పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

నరసన్నపేట: జిల్లా పరిధిలో ఉన్న కోర్టుల్లో ఉద్యోగాల భర్తీకి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు బుధవారం స్థానిక కోర్ టెక్నాలజీలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. 320 మందిని కేటాయించారు. మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఒక్కో షిఫ్టుకు గంటన్నర సమయాన్ని కేటాయించారు. అభ్యర్థులకు తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. ఈ నెల 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

అన్నసమారాధన


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బూర్జ: మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో నీలమణి దుర్గ ఆలయ వారోత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతున్నాయి. బుధవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలి


హిరమండలంలో సమావేశమైన ప్రజాప్రతినిధులు, నాయకులు

హిరమండలం: హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలను శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించేలా కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోవాలని ఈ రెండు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా మండల కేంద్రాల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలను శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో చేర్చుతూ.. శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలన్నారు. రెండు మండలాల ప్రజల అభిమతాని అనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర, కేంద్ర మంత్రులు కూటమి ప్రభుత్వాన్ని ఒప్పించాలన్నారు. దీనికోసం నాయకులంతా కలిసికట్టుగా పని చేసేందుకు సభలో పాల్గొన్నవారంతా ఆమోదం తెలియజేశారు. భౌగోళికంగా, రవాణాపరంగా సదూరమైన పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆ జిల్లాలో హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలను చేర్చడం ప్రజల మనోభావాలకు విరుద్ధమన్నారు.

సామాన్యుడిపై.. ధరాఘాతం

- కూరగాయల ధరలకు రెక్కలు
- అమాంతం ధరలు పెంచేస్తున్న దళారీలు
- ఇబ్బంది పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు



సరుబుజ్జిలి: నిత్యావసరాలతోపాటు కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు తగ్గడం, రవాణా ఛార్జీలు పెరగడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అయితే పంటలు పండిస్తున్న రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు ధర లభించడంలేదన్న విషయం వాస్తవం. ఏది ఏమైనప్పటికీ గతంలో రూ.200 సరకులు కొంటే కుటుంబానికి వారం రోజులు సరిపోయేవి. కానీ నేడు ఆ పరిస్థితిలేదు. దీనివలన సామాన్యుడు తినడానికి కూడా నానా ఇబ్బందులు పడుతున్నాడు.

ఆమదాలవలస నియోజకవర్గంలో....

ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కూరగాయల సాగు అధికంగా చేస్తున్నారు. దీంతో ఇక్కడ పండే కూరగాయల రైతులుతో వ్యాపారులు ఒప్పందం చేసుకుని మార్కెట్‌లో ఉండే షాపులకు అందజేస్తారు. మార్కెట్‌లో ఉన్న వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు రాకుండా అజమాయిషీ ప్రదర్శిస్తున్నారు. రైతులుకు సరైన ధరలు చెల్లించని దళారీలు వినియోగదారులపై ధరల మోతమోగిస్తున్నారు. ఒక్కో మార్కెట్‌లో వివిధ రకాల ధరలకు కూరగాయలు విక్రయిస్తుండడం గమనార్హం. రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన దళారీలు మరలా గ్రామాల్లోకి తెచ్చి అధిక ధరలకు విక్రయిన్నారు.

బహిరంగ మార్కెట్‌లో (బుధ వారం నాటికి) కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	కేజీ ధర
వంకాయలు	రూ.50
టమాటా	రూ.60
బెండకాయలు	రూ.60
బీరకాయలు	రూ.50
బంగాళాదుంపలు	రూ.40
ఉల్లిపాయలు	రూ.25
చిక్కుడు	రూ.40
పచ్చిమిర్చి	రూ.90
దొండకాయలు	రూ.40
బీన్స్	రూ.85
క్యారెట్	80

ఏం కొనలేం.. తినలేం



పెరుగుతున్న కూరగాయల ధరలతో మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పెరటిలో లభించే మునగ, తోట, అరటి కాయగూరలతో సర్దుకుపోతున్నాం. మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేయలంటే గుండె గుబేల్ మంటుంది. బజారుకు వెళ్లినా తక్కువ మొత్తంలో కూరగాయలు కొంటున్నాం.

– అన్నపూర్ణ , గృహిణి, సరుబుజ్జిలి

ధరలతో దడ పుడుతోంది



కూరగాయల ధరలు కట్టడికి ప్రభుత్వం అన్ని రకాల ప్రణాళికలు చేస్తుంది. అయితే దళారీల మాయమాటలకు రైతులు మోసపోతున్నారు. దళారీలు గ్రామాల్లోకి వెళ్లి రైతులను మోసం చేసి తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారు. ప్రతి వంటలో టమాటా వేయాలి. టమాటా ముట్టుకొంటే షాక్ కొడుతుంది.

– భద్రమ్మ, గృహిణి, సరుబుజ్జిలి

మోసకారి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం


హిరమండలం: పెద్దగూడలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధిలోని పెద్దగూడ, దబ్బగూడ గిరిజన గూడల్లో బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెద్దింటి గోపాలం, సర్పంచ్ సవర శైలాస్, ఉప సర్పంచ్ సవర జమ్మయ్య, పార్టీ నాయకులు లోలుగు లక్ష్మణరావు, వెలమల బాలరాజు, మూకళ్ల చిన్నయ్య, చెక్కా బాలకృష్ణ, పి.సింహాచలం, గొర్లె తిరుపతి రావు, నక్క ఆనందరావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: గిరిజనుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ భూతాలగూడ గిరిజన గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన గ్రామాల రహదారులు బాగు చేయడం లేదన్నారు. అర్హులైన వారికి కొత్త పింఛన్‌లు మంజూరు చేయలేదన్నారు. వైద్యం అందించడంలో పూర్తిగా వైఫలం చెందారని విమర్శించారు. తాగునీటి కోసం గిరిజనులు అల్లాడుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పార్టీ నాయకుడు సవర రమేష్, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: భూతాలగూడలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రెడ్డి శాంతి

అధిక రేటుకు యూరియా కొనుగోలు చేస్తున్నాం..

యూరియా బస్తా రూ.400కు ప్రైవేట్ వర్తకుల వద్ద కొనుగోలు చేస్తున్నామని రెడ్డి శాంతి దృష్టికి భూతాలగూడ గ్రామస్తులు తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వం ఇంతవరకు ఎరువులు అందించలేదన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రెడ్డి శాంతి హామీ ఇచ్చారు.

పలు కుటుంబాలకు పరామర్శ


నరసననపేట: మాకివలసలో ముసలినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: మండల పరిధిలోని మాకివలస, కిల్లాం, బొరిగివలస గ్రామాల్లో గల పలువురి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య బుధవారం పరామర్శించారు. కిల్లాం గ్రామానికి చెందిన ధర్మాన సూర్యనారాయణ, మాకివలస గ్రామానికి చెందిన బుద్దల ముసలినాయుడు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కృష్ణచైతన్య పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న, కనపల శేఖరరావు, బుద్దల రాజశేఖర్, నేతింటి రాజేశ్వరరావు, సతివాడ రామినాయుడు, తదితరులు ఉన్నారు.

కుమ్మరిగుంటలో..

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన పాగోటి రాములు భార్య బుధవారం మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో డీసీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, రెడ్డి పాపయ్య, సర్పంచ్ శంకరబాబు, తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పాతపట్నం: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను టెక్కలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు బుధవారం తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో స్టాక్ రిజిస్ట్రర్లు, బిల్లు పుస్తకాలు, గోదాంలు పరిశీలించారు. రసాయనిక ఎరువులను రైతులకు ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ పి.కిరణ్‌వాణి, ఏఏఓ భారతి పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన మహేంద్రతనయ


పాతపట్నం వద్ద మహేంద్రతనయ ప్రవాహం

పాతపట్నం: మహేంద్రతనయ నది ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ఉధృత్తంగా ప్రవహించించి. బుధవారం ఉదయానికి కొంత మేర తగ్గింది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేపై రెండు అడుగుల ఎత్తులో నీరు ప్రస్తుతం పారుతోంది. దీంతో కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీసులు సిబ్బంది కాజ్‌వే వద్ద కాపలా కాస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

ఆమదాలవలస: ప్లాస్టిక్ కవర్లు విక్రయిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి హెచ్చరించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సచివాలయ అధికారులతో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు, నిల్వ ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత దుకాణదారులకు అపరాధ రుసుం విధించారు. మున్సిపల్ రెవెన్యూ బిల్ కలెక్టర్ డి.రవి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్‌ను చూపిస్తున్న ఎంఈఓ రాములు, ఉపాధ్యాయులు

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం, ఎంఈఓ రాములు, ఉపాధ్యాయులు బుధవారం పంపిణీ చేశారు. ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మెటీరియల్ తయారు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. బయలాజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర కౌన్సిలర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులను ఆసక్తితో చదవాలన్నారు. ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ మాట్లాడుతూ నిపుణులైన ఉపాధ్యాయుల సహకారంతో రూపొందించిన ఈ మెటీరియల్ మంచి ఫలితాలను సాధించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు పి.రవికుమార్, ఎస్.అరుణ, బి.శరత్ కుమారి, పి.మోహనరావు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందివ్వాలి

నరసన్నపేట: మండల పరిధిలోని 54 రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు బియ్యం, ఇతర రేషన్ సరుకులు సక్రమంగా అందివ్వాలని రేషన్ డీలర్లకు తహసీల్దార్ టి.సత్యనారాయణ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 26వ తేదీ నుంచి వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి సరుకులు ఇవ్వాలన్నారు. సమయ వేళలు పాటించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, టీడీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులే కీలకం

- రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం హెడ్ డాక్టర్ కె.మధుకుమార్


నరసన్నపేట: మాట్లాడుతున్న డాక్టర్ కె.మధుకుమార్

నరసన్నపేట/సారవకోట: ఖరీఫ్ వరిలో యాజమాన్య పద్ధతులే ప్రధానమని రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం హెడ్ డాక్టర్ కె.మధుకుమార్ అన్నారు. నరసన్నపేట మండలంలోని మాకివలసలో, సారవకోట మండలంలోని కిన్నెరవాడలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి యోజన పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులుకు బుధవారం అవగాహన కల్పించారు. ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వరి పంట కాలంలో రెండు సార్లు పొటాష్‌ను తగిన మోతాదు వేసుకోవాలన్నారు. ఆమదాలవలస పరిశోధనా కేంద్రం శాస్త్ర వేత్తలు ఎం.శ్రీనివాస్, బి.స్వాతి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్ కలుపు నివారణ పద్ధతులను వివరించారు. తెగుళ్లు, పురుగు మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నరసన్నపేట ఏఓ సూర్యకుమారి, సారవకోట ఏఓ వెంకటరావు పాల్గొన్నారు.

నీటిలోనే వరి పంట


పాతపట్నం: బూరంగాం సమీపంలోని చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

నరసన్నపేట: మండలంలోని చిక్కాలవలస, మామిడివలస, సుందరాపురం గ్రామాల పరిధిలో సుమారు 210 ఎకరాల్లో వేసిన వరి వెద పొలాలు నీట మునిగాయని ఏఓ సూర్యకుమారి తెలిపారు. నీట మునిగిన వరి పొలాలను రైతులతో కలిసి వెళ్లి బుధవారం పరిశీలించారు. వర్షం తగ్గడంతో నీరు కిందకు వెళ్లే అవకాశం ఉంటుందని, రెండు రోజుల్లో పొలాల్లో నీరు తగ్గుతుందన్నారు. నీరు తగ్గిన వెంటనే బూస్టర్ డోస్‌ను పిచికారీ చేయాలన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ నీట మునిగిన వరి పొలాలు ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు.


నరసననపేట: మామిడివలస వద్ద తంపర పొలాలను పరిశీలిస్తున్న ఏఓ సూర్యకుమారి


పాతపట్నం: పాతపట్నం వద్ద నీట మునిగిన వరి పంట పొలాలు

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

పాతపట్నం: ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట పొలాలు చెరువుల తలపిస్తున్నాయి. వరి పొలాల్లో నీరు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుమ్మ, పోగడవల్లి గెడ్డలు ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయి. బడ్డుమర్రి గోపాలపురం, పెద్దలోగిడి, సింగుపురం, లాబర, ఆర్.ఎల్.పురం, చాకిపల్లి, రొంపివలస, కాగువాడ, బూరగాం, పాతపట్నం తదితర గ్రామాల్లోని వరి పొలాల్లో నీరు నిల్వ ఉంది.

వినాయక విగ్రహాలు సిద్ధం


పైడితల్లి ఆలయం వద్ద మట్టి విగ్రహాలను పరిశీలిస్తున్న లక్ష్మున్నపేట వాసులు

నరసన్నపేట: వినాయక చవితి సమీపిస్తుండటంతో తమకు నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేసేందుకు యువకులు, కమిటీ పెద్దలు ఆసక్తి చూపుతున్నారు. విగ్రహాలను పరిశీలించి నచ్చిన వాటికి అడ్వాన్స్ ఇస్తున్నారు. నరసన్నపేటతోపాటు కోమర్తి, గుండవల్లిపేట వద్ద వినాయక విగ్రహాలు ప్రత్యేక టెంట్‌ల్లో సిద్ధం చేస్తున్నారు. వీటిని స్థానికులు వచ్చి పరిశీలిస్తున్నారు. అయితే ఎప్పటిలాగే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వైపే అందరూ మొగ్గు చూపుతున్నారు. మట్టి విగ్రహాలు పైడితల్లి ఆలయం వద్ద తయారు చేస్తున్నారు. వినాయక ఉత్సవాల కమిటీ ప్రతినిధులు విగ్రహాలను కొనుగోలుకు బుధవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన

జలుమూరు: వరిలో విరివిగా వేసే యూరియాకు బదులుగా నానో యూరియా వినియోగంపై రైతులు దృష్టి పెట్టాలని వరి కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ దుంగ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం అచ్చుతాపురంలో వరి పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎకరాకు నానో యూరియా 500 ఎం.ఎల్ బాటిల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. అదే డ్రోన్ ద్వారా పది లీటర్ల నీటిలో కలపాలన్నారు. ప్రస్తుతం యూరియాకు ఉన్న డిమాండ్‌ను అధిగమించాలన్నారు. కె.వి.కె శాస్త్రవేత్తలు, ఏఓ కింజరాపు రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి


బూర్జ: ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ అనిత, వైద్య సిబ్బంది

బూర్జ: పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. మండల కేంద్రంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అవగాహన ర్యాలీ చేపట్టారు. బూర్జ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. బూర్జ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాపింగ్ కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి.వి.సత్యనారాయణ, జిల్లా సహాయ మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉర్లాంలో..

నరసన్నపేట: దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యురాలు శాలిని అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఉర్లాం పీహెచ్‌సీ ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

గంగువాడలో..

పాతపట్నం: మండలంలోని గంగువాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. గంగువాడలో వైద్యుడు ఎస్.శివకుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724, 7075499517

నరసన్నపేట: 9912220367

Office mail : sklmadvt@gmail.com

బేరాల్లేక విలవిల..

- ఆటో డ్రైవర్ల నడ్డివిరిచిన ఉచిత బస్సు పథకం
- ఆటోల్లో మహిళా ప్రయాణికులే అధికం
- ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల వేడుకోలు


రాతికర్ర చెరువు వద్ద ఉన్న ఆటోలు

నరసన్నపేట:

నిరక్షరాస్యత, నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతూ.. జీవన భృతిలేక అనేకమంది బతుకుదెరువు కోసం ఆటోలను నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ నెల 15వ తేదీన కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తీసుకువచ్చింది. అంతే ఒక్కసారిగా ఆటోవాలాల జీవనం గతి తప్పింది. ఏం చేయాలో పాలుపోక ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు కల్పించడం మంచిదే. అయితే ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వచ్చిన ఆదాయంతో పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబాలపై ఉచిత బస్సు పథకం ప్రభావం తీవ్రంగా పడిందని ఆందోళన చెందుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో ఆటోల వివరాలు (సుమారుగా)

మండలం	ఆటోలు
నరసన్నపేట	480
పోలాకి	390
జలుమూరు	410
సారవకోట	290

గోరుచుట్టుపై రోకలిపోటు..

ప్రధానంగా జాతీయ రహదారితోపాటు ప్రధాన మార్గాల్లో తిరుగుతున్న ఆటోలపై ఈ పథకం ప్రభావం అధికంగా ఉంది. ఇప్పటికే పెరిగిన ఆయిల్ చార్జీలు, ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్‌లు, మెయింటెనెన్స్, షర్మిషన్లు, ఇతర ఖర్చులతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం పథకం గోరుచుట్టుపై రోకలిపోటు మారింది. నరసన్నపేట నుంచి టెక్కలి, సారవకోట, పోలాకి, కోటబొమ్మాళి, శ్రీముఖలింగం, శ్రీకాకుళం, ఆమదాలవలస వంటి రూట్లలో తిరిగే ఆటోలపై అధిక ప్రభావం పడింది. ఐదు రోజులుగా వంద రూపాయలు ఆదాయం కూడా రాని పరిస్థితి.

హామీ అమలు చేయాలి..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సహాయం చేయాలని, ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే 15 నెలలు అవుతుందని, ఒక ఏడాది పథకాన్ని కోల్పోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన చెందుతున్నారు.


ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న ఆటోలు

ప్రత్యామ్నాయం చూపాలి



ఆటోల్లో మహిళా ప్రయాణికులే ఎక్కువ. ఉచిత బస్సు పథకంతో మహిళలు ఆటోలు ఎక్కడ లేదు. ఐదు రోజులుగా ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఖర్చులు యథావిధిగా అవుతున్నాయి. ప్రభుత్వమే ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి. లేకపోతే ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డు ఎక్కడం ఖాయం.

– కె.చంటి, ఆటో డ్రైవర్, పోలాకి

ఖర్చులు పెరిగాయి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటో ఖర్చులు అమాంతంగా పెరిగాయి. బ్రేక్, ఇన్సూరెన్స్ భారం అధికమైంది. మరోవైపు కుటుంబ ఖర్చులు రెట్టింపయ్యాయి. దీంతో ఆదాయం పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తుంటే.. ఇప్పుడు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పెట్టి కష్టాల్లోకి నెట్టింది. కుటుంబ పోషణ కష్టంగా మారింది.

– వెంకటరమణ, ఆటో డ్రైవర్, నరసన్నపేట